క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంపై శ్రద్ధ చూపాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్

తాండూరు టౌన్: తాండూరు నుంచి వికారాబాద్‌కు రోడ్డు నిర్మాణ పనులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శ్రద్ధ చూపాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తాండూరు బైపాస్ రోడ్డు భూనిర్వాసితుల పరిహారం కోసం ఎమ్మెల్యే చేసిన కృషిని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. తాండూరు, వికారాబాద్ రోడ్డు మార్గం విషయంలో కూడా ఎమ్మెల్యే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే గుంతల మయంగా మారిన రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణ పనులు నిర్వహించేలా తగిన శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

ఈవో రాజేందర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ జయరాములు



సీసీ కెమెరాల వద్ద ఈవో రాజేందర్ రెడ్డి, ఛైర్మన్ జయరాములు

దుద్యాల్: సీసీ కెమెరాలతో నేరాలు అదుపుచేయొచ్చని ఈవో రాజేందర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ జయరాములు పేర్కొన్నారు. మంగళవారం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ జయరాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్శన నిమిత్తం దేవాలయానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. మహిళల విలువైన ఆభరణాలు, ఆలయం ఎదుట పార్క్ చేసే వాహనాలకు రక్షణగా ఉపకరిస్తాయన్నారు. అంతేకాకుండా దాడులు, దోపిడీలు సంభవించినప్పుడు నిందితులను సులభంగా గుర్తించొచ్చని వివరించారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

గ్రామీణ బ్యాంకు అధికారులు



అమ్మవారిని దర్శించుకున్న బ్యాంకు అధికారులు

దుద్యాల్: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రామీణ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. పోలేపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవతను మంగళవారం వారు దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ బ్యాంకు ఖాతాకు క్యూఆర్ కోడ్ మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను ఈవో కోరారు. దీనికి వారు స్పందించి త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు శీల, చిన్న, సాయి సంపత్ రెడ్డి, శేఖర్, ఆలయ ఛైర్మన్ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ముందస్తు దీపావళి



ముందస్తు దీపావళి జరుపుకుంటున్న విద్యార్థులు, మంచ్ ప్రతినిధులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ముందస్తు దీపావళి నిర్వహించారు. తాండూరు పట్టణానికి చెందిన మార్వాడి యువ మంచ్ ప్రతినిధులు మంగళవారం కేజీబీవీలో విద్యార్థులతో కలిసి టపాకాయలు పేల్చారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. హాస్టల్ విద్యార్థులతో దీపావళి పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మంచ్ ప్రతినిధులతో కలిసి విద్యార్థినులు కూడా టపాకాయలు, చిచ్చుబుడ్లను కాల్చారు. ఈ కార్యక్రమంలో మార్వాడి యువమంచ్ తాండూరు అధ్యక్షుడు అనిల్ సార్డా, జాతీయ కార్యవర్గ సభ్యులు మన్‌మోహన్ సార్డా, రోహిత్ అగర్వాల్, ప్రత్యేకాధికారిణి ఆశలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పర్మిట్ల జారీలో అక్రమాలు!

- ఇందిరమ్మ ఇళ్ల పేరిట జోరుగా వ్యాపారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు
- తహసీల్దార్ కార్యాలయంలో అక్రమార్కుల హడావిడి



తహసీల్దార్ కార్యాలయం

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా కోసం తహసీల్దార్ కార్యాలయంలో జారీ చేస్తున్న పర్మిట్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని మైల్వార్, ఎక్మాయి, బషీరాబాద్, అల్లాపూర్, దామర్‌చెడ్ గ్రామాలకు చెందిన ఇసుక మాఫియాను నడిపిస్తున్న కొందరు వ్యాపారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట పర్మిట్లు తీసుకుంటున్నారు. ఒక్కో ఇంటికి 4 నుంచి 5 ట్రిప్పులకు అనుమతులు మంజూరు చేయించుకొని బయటి నిర్మాణాలకు, ఇతరులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే కిందిస్థాయి ఉద్యోగి ఒకరు ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్‌కి రూ.5వేల వరకు వసూలు చేసి అనుమతులు ఇప్పిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అనుమతులు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉండడంతో అధికారులు కూడా ఎవ్వరడిగినా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఈ కార్యాలయ ఉద్యోగులతో చేతులు కలిపి పర్మిట్లు జారీ చేయించుకుంటున్నట్లు తెలిసింది. వాస్తవంగా అవసరం ఉన్న లబ్ధిదారులు ఇసుక పర్మిట్ల కోసం వెళితే సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మరోవైపు లంచం ముట్టచెప్పిన వారికే త్వరగా ఇప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్కేపల్లిలో ఉపాధి పనులపై సమీక్ష



సామాజిక తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న షఫి

మోమిన్‌పేట: ఎన్కేపల్లి గ్రామంలో 2024–25 సంవత్సరానికి గాను రూ.36,98,769ల ఉపాధి పనులు నిర్వహించారని సామాజిక తనిఖీ డీఆర్‌పీ షఫి తెలిపారు. మంగళవారం ఎన్కేపల్లిలో నాలుగు రోజుల పాటు సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన గ్రామసభలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా షఫి మాట్లాడుతూ 22రకాల పనులకు గాను సుమారు రూ.37లక్షలను కూలీలకు చెల్లించారన్నారు. వర్షాకాలంలో నాటిన మొక్కలు సజావుగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రూ. 34,84,952లు వెచ్చించి సీసీ రోడ్లను నిర్మించినట్లు ఆయన తెలిపారు. కాని పంచాయతీ రాజ్ విభాగం నుంచి సంబంధిత ధ్రువపత్రాలు ఇవ్వనందునా రోడ్లను పరిశీలించలేదన్నారు. చిన్న చిన్న పొరపాట్లు మినహా ఎలాంటి అవకతవకలు తమదృష్టికి రాలేదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీఏ ఎల్లయ్య, కార్యదర్శి తిరుపతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆడివిరెడ్డి, నాయకులు సురేందర్, మల్లయ్య, దుర్గయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడెకరాల భూమి కేటాయించాలి



ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

కుల్కచర్ల: అంబేడ్కర్ భవన నిర్మాణం, మూడెకరాల భూమిని మండల దళిత కమ్యూనిటీకి కేటాయించాలని దళిత సంఘాల నాయకులు భరత్‌కుమార్, లాలు, కొమ్ము శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సంఘం నాయకులు చంద్రయ్య, బాబు, ఈదిగళ్ల శ్రీనివాస్, భీంసేన్, పీరంపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్ఐ మోహనక్రిష్ణ



మాట్లాడుతున్న ఎస్ఐ మోహనక్రిష్ణ

పరిగి: ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసించినప్పుడు లింగ విభేదాలు తొలుగుతాయని ఎస్ఐ మోహనక్రిష్ణ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంవీ ఫౌండేషన్, ఆడపిల్లల సమానత్వం సమాఖ్య ఆధ్వర్యంలో బాలికల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ హాజరై మాట్లాడుతూ నేటికి లింగ అసమానతలకు, బాల్య వివాహాలు, అమ్మాయిలకు నిర్ణయాధికారం లేకపోవడం వంటివి కొనసాగుతున్నాయన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష బోధనతో ఆలోచన శక్తి పెంపు



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అగ్గనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

యాలాల: ప్రత్యక్ష బోధన పద్ధతితో విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెంపొందించొచ్చని ఉపాధ్యాయులు మురహరినాథ్, సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం అగ్గనూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 3, 4వ తరగతి విద్యార్థులకు స్థానిక నర్సరీకి తీసుకెళ్లి మొక్కల గురించి వివరించారు. మొక్కల పెంపకం, భాగాలు, మొక్కల రకాల గురించి పేర్కొన్నారు. ఇలాంటి ఫీల్డ్‌ట్రిప్పులతో విద్యార్థుల్లో ఆలోచన, పరిశీలన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

సాల్వీడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం రాంచందర్ రావు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

కుల్కచర్ల: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని సాల్వీడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం రాంచందర్ రావు పేర్కొన్నారు. సోమవారం తాండురులో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో పాఠశాల నుంచి పది మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం రాంచందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కేశవులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, ఉపాధ్యాయులు స్వయంప్రకాశ్, తులసినాయక్, వెంకటేశ్, రమేశ్‌కుమార్, నసీరుద్దీన్, ప్రసాద్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

బషీరాబాద్: సేంద్రియ ఎరువులు ఎక్కువగా వినియోగించాలని, వాటితోనే పంటలు పండించాలని గోపాల్స్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శివకుమార్ పేర్కొన్నారు. వీటి గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. మంగళవారం మండలంలోని ఎక్మాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రకృతి, పర్యావరణంపై అవగాహన నిర్వహించారు. రసాయన ఎరువులతో పంటలు పండిస్తే క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతామన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతిని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థి దశనుంచే అందుకు కృషి చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని సాధ్యమైనంత వరకు నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పెరివార్ స్వామి, ప్రధానోపాధ్యాయులు పాండురంగామూర్తి, గ్రామ పెద్దలు సుదర్శన్, దుశ్యంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేశ్, విజయ్, కృష్ణ, రామలక్ష్మీ, వెంకటమ్మ, రైతులు పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు మేలు

మండల పశువైద్యాధికారి గీత

మోమిన్‌పేట: గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులకు మేలు కలుగుతుందని మండల పశువైద్యాధికారి గీత పేర్కొన్నారు. బుధవారం నుంచి గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు గీత పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తప్పకుండా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు



మాట్లాడుతున్న శేఖర్

దుద్యాల్: వేరుశనగ విత్తనాలను సబ్సిడీతో అందజేస్తున్నట్లు రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు వెల్లడించారు. మంగళవారం పోలేపల్లి క్లస్టర్ పరిధిలోని హకీంపేట్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, హకీంపేట్ శ్రీనివాస్ రెడ్డి రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అర్హులైన రైతులు సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం ఆత్కూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. తాండూరు పట్టణానికి చెందిన నంబర్ 1 ఉన్నత ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్య క్రమంలో శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణ, రాములు, అశోక్, సురేశ్, శివ, రమేష్, గోవింద్‌రావు, నరేందర్‌లు పాల్గొన్నారు.

బీసీ శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

మున్సిపల్ కమిషనర్ యాదగిరికి జేఏసీ వినతి

తాండూరు టౌన్: పట్టణంలోని బీసీ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ జేఏసీ సభ్యులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్లు మధ్యలోనే నిర్మాణ పనులు వదిలేసి వెళ్తున్నారని కమిషనర్ దృష్టికితెచ్చారు. అంత్యక్రియలను అపరిశుభ్ర వాతావరణంలోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. భానుప్రసాద్, మహేశ్, శేఖర్, శ్రీను, సాయికుమార్, మనోహర్, శివ, ప్రసాద్, చిన్న తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

బంగారు తల్లులు.. భవిష్యత్ మీదే

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: బంగారు తల్లులు భవిష్యత్ మీదేనని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని కోత్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ముందుగా పాఠశాల ఆవరణను పరిశీలించారు. మరమ్మతులకు గురైన కిచెన్‌షెడ్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ..పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ కష్టపడి చదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జొన్నల వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

పూడూరు: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం డివిజన్ ఇన్‌చార్జి నర్సింలు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్‌నేరాలు, బాల్యవివాహాల నిర్మూలన, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ టెక్నాలజీ పెరుగుతున్నకొద్దీ ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయన్నారు. ప్రతీరోజు ఎక్కడో ఓ చోట మోసాలకు గురవుతున్నారన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఆర్థిక నష్టాన్ని నివారించుకోవాలని సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు సావిత్రి, శోభ, పాఠశాల హెచ్ఎం వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు ఆసరా

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి, తహసీల్దార్ పద్మావతి తదితరులు

బొంరాస్‌పేట: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డలకు ఇవి ఆసరగా నిలుస్తాయన్నారు. మండల పరిధిలోని బొంరాస్‌పేట్4, రేగడిమైలారం4, చౌదర్‌పల్లి4, నాందార్‌పూర్2, బురాన్‌పూర్4, నాగిరెడ్డిపల్లి1, ఎన్కేపల్లి1, ఏర్పుమళ్ల3, కొత్తూరు2, తుంకిమెట్ల3, వడిచర్ల4, దుప్‌చర్ల1, సాలిండాపూర్2 మొత్తం 35 చెక్కులు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, కాంగ్రెస్ నాయకులు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, భీమయ్యగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



విద్యార్థులకు మెటీరియల్స్‌ను అందజేస్తున్న వెంకట్

మండల విద్యాధికారి వెంకట్

దోమ: విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ..జీవశాస్త్ర ఉపాధ్యాయుడు విజయ్‌సాయి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ఎంట్రెన్స్ రాయడానికి రూ.3వేలతో కొనుగోలు చేసి అందజేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులు చదువులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, పట్టుదలతో చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు కీర్తి తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు వినియోగించుకోవాలి

మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి



శనగలు పంపిణీ చేస్తున్న అధికారులు

అనంతగిరి: రైతులు సబ్సిడీ విత్తనాలు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ మండలంలో గొట్టిముక్కుల గ్రామంలోని రైతువేదికలో అర్హులైన రైతులకు సబ్సిడీపై శనగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పప్పు దినుసుల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు జాతీయ ఆహార భద్రత పథకం, పప్పు దినుసుల పథకం కింద 50శాతం సబ్సిడీతో శనగలు పంపిణీ చేస్తుందన్నారు. అనవరం ఉన్న రైతులు తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డిపేట పీఏసీఎస్ ఛైర్మన్ ముత్యంరెడ్డి, వైస్ ఛైర్మన్ పాండు, మండల ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు రేట్ల జాబితాను ప్రదర్శించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరి

తహసీల్దార్ వెంకటేశ్వరి

పరిగి: మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు రేట్ల జాబితాను ప్రదర్శించాలని తహసీల్దార్ వెంకటేశ్వరి సూచించారు. మంగళవారం మండలంలోని ఆయ గ్రామాల మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్న సంబంధిత ఫారాలను సకాలంలో తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కన్న ఎక్కువ వసూలు చేస్తే మీసేవ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పాలన అధికారులు, ఆర్ఐలు అన్ని రకాల ధ్రువపత్రాల విచారణను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు విజయేందర్, అనిల్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు సంపూర్ణ మద్దతు

కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు గోపాల్



అభివాదం చేస్తున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తాండూరు డివిజన్ కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని బీరప్ప స్వామి దేవాలయంలో నాయకులు, కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించిందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీం కోర్టులో వాదనలు బలంగా వినిపించి బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రిజర్వేషన్లను కేవలం స్థానిక సంస్థల ఎన్నికలకే పరిమితం కాకుండా విద్య, ఉద్యోగాల కల్పనలో కూడా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు జగదీశ్, ఉపాధ్యక్షుడు పూజారి పాండు, నాయకులు మలప్ప, శేఖర్, హన్మయ్య, కిష్టప్ప, దస్తప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.